క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అంబాజీపేట: మండలంలో ముక్కామల సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మత్తుల పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల మోడేకుర్రు, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ముక్కామల, ఇరుసుమండ, వక్కలంక, కమ్మ జువారిలంక, శ్రీరామ్‌పురం, వానపల్లి, పసుపల్లి, గొలకోటివారిపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆలమూరు పరిధిలో...

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు చెప్పారు.

అయినవిల్లి మండలంలో..

అయినవిల్లి: 33 కేవీ లైన్‌కు సంబంధించి మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని గ్రామాలకు విద్యుత్ నిలిపేయనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

రావులపాలెం: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని పలువురు వక్తలు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్టార్ట్ అప్ ప్రోగ్రాంపై కార్యక్రమాన్ని జువాలజీ అధ్యాపకురాలు సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల వేస్ట్ మెటీరియల్స్, కొబ్బరిపీచు తదితర వస్తువులతో పిచ్చుకల ఆవాసాలకు అనువైన గూళ్లను తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు సత్యమూర్తి, రమేష్, యువరాజ్, సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ మన్యం వర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

అంబాజీపేట: విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కుల పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన విద్యార్థి వినియోగదారుల క్లబ్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా బలరామమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ జంక్‌ఫుడ్‌ను ఇష్టానుసారం తింటున్నారని, వాటి విషయంలో విద్యార్థులు జర భద్రంగా ఉంటే మేలని సూచించారు. సమావేశంలో వి.సత్యనారాయణ, ఇబ్రహీం, రవణం రాము, బేగం, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మామిడికుదురు: విద్యార్థులు చెడు వ్యసనాలకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండి, శ్రద్ధగా చదువుకోవాలని నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా గురువారం నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహనా సదస్సు జరిగింది. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో నాణ్యమైన విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో జాలెం సుబ్బారావు, స్థానికులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీకి అనుమతులు తప్పనిసరి

ఆత్రేయపురం: గ్రామాల్లో బాణసంచా తయారీకి అనుమతులు తప్పనిసరి తీసుకోవాలని ఎస్ఐ ఎస్.రాము పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని నార్కెడ్‌మిల్లి, తాడిపూడి గ్రామాల్లో అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి తయారుచేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 200 తారాజువ్వలు, 250 తారాజువ్వలు, 5 కేజీల బొగ్గు పౌడర్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

వీరవల్లిపాలెంలో సామూహిక సీమంతాలు

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయగౌరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పేరుతో ఏడి‘పింఛెన్’

- 80 శాతానికి పైగా అంగవైకల్యమున్నా పింఛన్ సొమ్ములో కోత
- మంచానికి, వీల్‌చైర్‌లకు పరిమితమైనా రూ.6 వేలే ఇస్తారట
- గతంలోలానే రూ.15 వేలు ఇప్పించాలని లబ్ధిదారుల ఆవేదన



స్పందనలో ఫిర్యాదు చేసి వస్తున్న దివ్యాంగుడు సత్యనారాయణ

అంబాజీపేట: వారంతా 80 శాతానికి పైగా అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులు.. మంచానికి పరిమితమైపోయినవారు కొందరైతే వీల్‌చైర్‌లోనే కాలం గడిపేవారు మరికొందరు.. వేరొకరి సహాయం లేనిదే అడుగు తీసి అడుగు వేయలేని దయనీయ స్థితిలో జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. అయినా కూటమి ప్రభుత్వ పెద్దలకు జాలి లేకపోయింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ సర్వే పేరుతో తూతూమంత్రపు వ్యవహారం నడిపించి దివ్యాంగుల పింఛన్లలో కోతేసింది. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.15,000 తీసుకున్న లబ్ధిదారులకు సైతం సెప్టెంబర్ నెలలో రూ.6,000 మాత్రమే పింఛన్‌గా ఇచ్చారు. దీంతో ప్రభుత్వమిచ్చే పింఛన్ సొమ్ముపైనే ఆధారపడి జీవిస్తున్న ఎందరో దివ్యాంగులు కన్నీరుమున్నీరవుతున్నారు.

దివ్యాంగులపై గురి

ఎన్నికలకు ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించడం, అధికారంలోకి వచ్చాక వారిని ముప్పుతిప్పలు పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. సార్వత్రిక ఎన్నికలకు ముందు పింఛన్‌దారులందరికీ పింఛన్ మొత్తాన్ని పెంచేస్తానంటూ చంద్రబాబు ఊదరగొట్టేశారు. అధికారంలోకి వచ్చాక అక్రమ పింఛన్ల ఏరివేత పేరుతో ఎన్టీఆర్ భరోసా పింఛన్ సర్వేను తెరపైకి తీసుకొచ్చి కోత మొదలు పెట్టేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో 80 శాతానికి పైగా అంగవైకల్యముండి మంచానికి, వీల్ చైర్‌లకు పరిమితమై ఉన్న దివ్యాంగులకు నెలకు రూ.15,000 పింఛన్‌గా ఇచ్చేవారు. సెప్టెంబర్ నెల నుంచి వారిలో చాలామందికి రూ.6,000 వస్తుండడంతో పింఛన్‌దారులందరికీ ఏం చేయాలో పాలుపోవడం లేదు.

తూతూ మంత్రంగా సర్వే

80 శాతానికి పైగా అంగవైకల్యమున్న దివ్యాంగులను మళ్లీ తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆర్థోపెడిక్ వైద్యులను నియమించింది. అంబాజీపేట మండలంలో రూ.15,000 పింఛన్ తీసుకుంటున్న 55 మంది దివ్యాంగులను గుర్తించేందుకు ఈ ఏడాది ఆగస్టు 27వ తేదీన కొత్తపేట, అల్లవరం ఆర్థోపెడిక్ వైద్యులు సర్వే నిర్వహించారు. నిబంధనల ప్రకారం సదరు వైద్యుల బృందమే 80 శాతానికి పైగా అంగవైకల్యమున్నవారి ఇంటికి వెళ్లి సదరమ్ సర్టిఫికెట్‌తో పాటు వారి స్థితిగతులను పరిశీలించాల్సి ఉంది. అయితే అధికారుల బృందం మాత్రం కేవలం నాలుగైదు ఇళ్లను సందర్శించి మిగిలిన పింఛన్‌దారులను అంబాజీపేట, ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్దకు అర్జంటుగా రావాలంటూ కబురు పంపి రప్పించుకున్నారు. నడవలేని, అసలు మంచం మీది నుంచి లేవలేని పరిస్థితిలో ఉన్న దివ్యాంగులు తమ కుటుంబీకుల సాయంతో తీవ్ర వ్యయప్రయాసలు పడి ఆస్పత్రి వద్దకు వెళితే వైద్యులు నిర్లక్ష్యంగా పేరు, ఊరు అడిగి పంపించేశారు. చాలాచోట్ల ఆస్పత్రి వద్దకు ఎందుకు పిలిచారని అడిగినా సమాధానం ఇవ్వలేదు. తీరా చూస్తే సెప్టెంబర్ నెలలో వారిలో చాలా మందికి రూ.15,000కు బదులు రూ.6,000 మాత్రమే పింఛన్‌గా మంజూరైంది. దీంతో ఆయా లబ్ధిదారులంతా లబోదిబోమంటున్నారు. 85 శాతం పైబడి దివ్యాంగులంటూ సదరమ్ క్యాంపులో ఇచ్చిన ధ్రువీకరణ పత్రానికి విలువ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు తమకు నచ్చినట్లుగా సర్వేను తూతూమంత్రంగా పూర్తి చేశారని లబ్ధిదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ఈనెల 23వ తేదీన కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు.

సర్వే సక్రమంగా జరగలేదు



రూ.15,000 తీసుకునే వారి వివరాలను సేకరించేందుకు అధికారులు చేసిన సర్వే సక్రమంగా జరగలేదు. కేవలం ఆయా పీహెచ్‌సీల వద్దే వారికి నచ్చినట్లుగా సర్వే చేశారు. మంచానికి, వీల్‌చైర్, మూడు చక్రాల బండి వంటి వారి వివరాలను ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయలేదు. ప్రస్తుతం రూ.6 వేలు మాత్రమే పింఛన్ ఇస్తున్నారు. రీసర్వే చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బొంతు శ్రీనివాసరావు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు

ఇది చాలా అన్యాయం



నేను మంచానికే పరిమితమై ఉన్నాను. అధికారులు అంబాజీపేట పీహెచ్‌సీ వద్దకు రావాలని చెప్పారంటే ఎందుకో అర్థం కాక నా భార్య సాయంతో తీవ్ర వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లాను. గతంలో రూ.15,000 పింఛన్‌గా ఇచ్చేవారు. ఈ నెలలో రూ.6,000 మాత్రమే పింఛన్ ఇచ్చారు. ఇది చాలా అన్యాయం. నాకు న్యాయం చేయాలని స్పందనలో ఫిర్యాదు చేశాను.

– మట్టపర్తి వీరవెంకట సత్యనారాయణ, మెట్లకాలనీ, మాచవరం

90 శాతం అంగవైకల్యమున్నా రూ.6,000 ఇచ్చారు



నేను నడవలేని పరిస్థితిలో ఉన్నాను. గతంలో నాకు రూ.15,000 పింఛన్‌గా వచ్చేది. నెల రోజుల క్రితం అధికారులు ఆసుపత్రికి రమ్మన్నారంటే వెళ్లాను. నేను నా కుటుంబ సభ్యుల సహకారంతో ఆస్పత్రికి వెళితే నా పేరు నమోదు చేసుకుని పంపించేశారు. నాకు 90 శాతం దివ్యాంగ ధ్రువీకరణ పత్రం ఉన్నా ఈ నెలలో నాకు రూ.6,000 పింఛన్‌గా ఇచ్చారు.

– నందెపు నాగబాబు, దివ్యాంగుడు, అంబాజీపేట

చిరుత సంచారంపై కలవరం

ఆలమూరు: చిరుతపులి ఏ క్షణంలోనైనా మండలంలోకి ప్రవేశిస్తుందేమోనని లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆలమూరు మండలానికి సమీపంలోనే ఉన్న కడియం మండలంలోని కడియపులంక, బుర్రిలంక నర్సరీల్లో చిరుత సంచరిస్తుందనే సమాచారంతో మండల వాసులంతా కలవరం చెందుతున్నారు. గతంలోనూ జనారణ్యంలోకి వచ్చిన చిరుతపులి గౌతమి గోదావరి తీరం వెంబడి రావులపాలెం, కొత్తపేట మండలాల మీదుగా ముమ్మిడివరం చేరుకుని అక్కడ అటవీశాఖ అధికారులకు చిక్కిన విషయాన్ని మండల వాసులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం బుర్రిలంకకు మండలంలోని మడికి గ్రామానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో లంక గ్రామాల వెంబడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

మామిడికుదురు: టూటుకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ అడబాల తాతకాపు పి.గన్నవరంలో శుక్రవారం జరిగే జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాతకాపు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ రూపొందించేందుకు గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, స్థానిక పెద్దలు బోనం బాబు, విళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

అయినవిల్లిలో సుదర్శన హోమం

అయినవిల్లి: అయినవిల్లిలో కొలువైన సీతారామచంద్రస్వామివారి ఆలయంలో గురువారం సుదర్శన హోమం జరిపారు. ఆలయ అర్చకులు పి.లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. విశ్రాంత ఉద్యోగి వీవీవీఎస్ఎస్‌మూర్తి పర్యవేక్షణలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సుదర్శన హోమం నిర్వహించారు.

అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్



సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దేవవరప్రసాద్

సఖినేటిపల్లి: విధి నిర్వహణలో అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎంపీడీవో పీవీ సత్యనారాయణ శాఖల వారీగా రివ్యూ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవవరప్రసాద్ మాట్లాడుతూ మండలంలో రెండు, మూడు గ్రామాలకు కలిపి డంపింగ్ యార్డ్స్ నిమిత్తం ప్రభుత్వ భూమిని కేటాయించేలా చూడాలని డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్‌కు సూచించారు. స్థానిక సమతా కల్యాణం మండపం పూర్తి వినియోగంలోకి తేవడానికి చూడాలని ఎంపీడీవో పీవీ సత్యనారాయణకు చెప్పారు. అనంతరం విద్యుత్, రహదారులు, తాగునీరు, శానిటేషన్‌లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రసుతం మండల పరిషత్ వద్ద రూ.50 లక్షలు నిధులున్నాయని, మరో రూ.30 లక్షలు రావాల్సి ఉందన్నారు. నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్య క్రమంలో పనులు కేటాయిస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ పెదకాపు, మెడికల్ ఆఫీసర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పి.గన్నవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పోతవరం గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ వడలి కొండయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 100 రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నో మంచి పనులు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, పంచాయతీ కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన దీక్షలు గురువారం 16వ రోజుకు చేరుకున్నాయి. మేనేజ్‌మెంట్ మొండి వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ పలువురు శిబిరాన్ని సందర్శించి అధ్యాపకులకు మద్దతును తెలియజేస్తున్నారు. చింతా రాజబాబు, గడ్డం పిలిప్ రాజ్, నల్లి శివకుమార్, చవాకుల సూర్యప్రకాష్‌రావు, తాడి రంపాలరాజు, నల్లి మోహన్‌రావు, ఆచంట రామచంద్రరావు, దేశినేని ఉదయభాస్కరరావు, కడలి వెంకటరత్నం, కటికి రెడ్డి మహేష్ తదితరులు అధ్యాపకులకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం త్వరితగతిన విచారణ చేసి కళాశాల నిర్వహణను సక్రమంగా చేయాలని కోరారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ డ్రాప్స్

ఆలమూరు: మండలం పరిధిలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ వేసే కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనీమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య బృంద సభ్యులు ఆయా గ్రామాల్లోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు డ్రాప్స్‌ను వేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ పాల్గొన్నారు.

దశలవారీగా హామీలు అమలు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రకటించిన హామీలన్నీ దశల వారీగా అమలు చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని చొప్పెల్లలో సర్పంచ్ దంగేటి చంద్రకళ నేతృత్వంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. స్థానిక శ్రీరామ్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలకు డస్ట్‌బిన్‌లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మెర్ల గోపాలస్వామి, సూరపురెడ్డి సత్య, సుంకర కామరాజు, జాంప్రోలు వెంకట్రావు పాల్గొన్నారు.

అధిక ధరలను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవ రాజేంద్రప్రసాద్

మలికిపురం: ఆకాశాన్ని అంటుతున్న ఉల్లిపాయలు, కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే నియంత్రించాలని సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దిండి గ్రామంలో జరిగిన దిండి, రామరాజులంక సీపీఐ పార్టీ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో రామరాజులంక సీపీఐ శాఖ కార్యదర్శిగా మేడిచర్ల సత్యనారాయణ, మరో ఐదుగురు కమిటీ సభ్యులుగాను, దిండి గ్రామ శాఖ కార్యదర్శిగా దేవ రాజబాబు, మరో ఐదుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో సీపీఐ మలికిపురం మండల కార్యదర్శి దేవ సురేష్‌బాబు, ఏపుగంటి రామచంద్రరావు, దేవ నాగభూషణం, బత్తుల రవిప్రసాద్, డి.రత్నరాజు, పుల్లెల ఆనంద్, దేవ రాజబాబు, ఏనుగుపల్లి నరసింహమూర్తి, పెద్దిరెడ్డి రామారావు, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, సర్పంచ్

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్–19 పోటీలకు పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కె.సూర్యకనకదుర్గ, పీడీ అందె సూర్యనారాయణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో లక్కింశెట్టి విజయసాయిలక్ష్మి, రోళ్ల సంగీత కీర్తిలు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారిద్దరూ అక్టోబర్ నెలలో ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నారన్నారు. విద్యార్థులను సర్పంచ్ జల్లి బాలరాజు, పీఎంసీ చైర్‌పర్సన్ నూకల శ్రీరత్నమాల, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, బెహరా హనుమంతరావు, వీరా రవి తదితరులు అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గంటిలో సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తపేట: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలిద్దరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ సాగి బంగార్రాజు అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని గంటి గ్రామంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కె.చంద్రకళ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లలో పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. ఐరన్, కాల్షియం, విటమిన్లు కలిగిన ఆహారం తీసుకోవాలని వాటి ద్వారా రక్తహీనత నివారించవచ్చని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు. బంగార్రాజు గర్భిణులకు పండ్లు, చిన్నారులకు దుస్తులు సమకూర్చారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు, పంచాయతీ సెక్రటరీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల సాయం



సేకరించిన నగదును ఎంఈఓలు, హెచ్ఎంకు అందజేస్తున్న విద్యార్థులు

రావులపాలెం: విజయవాడ వరద బాధితులకు మండలంలోని రావులపాడు ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు రూ.25 వేల నగదును సాయంగా అందజేశారు. గ్రామంలో విరాళాలు సేకరించి, వాటితో పాటు విద్యార్థుల పాకెట్ మనీని కలిపి సాయంగా ఇచ్చారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ విధంగా సేకరించిన రూ.25 వేల నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపేందుకు హెచ్ఎం సునీతకు, ఎంఈఓలు నాగకుమార్, శ్రీనివాస్‌రాజు సమక్షంలో అందజేశారు. విద్యార్థుల స్ఫూర్తిని అభినందిస్తూ ఎంఈఓలు రూ.1,000 ప్రోత్సాహక డొనేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతిబస్, కేవీ శేఖర్, శ్యామల, వీరవేణి, ములా జోన్స్, హిమజా, వెంకటలక్ష్మి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలి



కొత్తపేట డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

కొత్తపేట: విద్యార్థులు జీవితంలోని ప్రతి దశలో నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. సత్యసాయి విద్యా విభాగం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. దాంట్లో భాగంగా గురువారం డిగ్రీ కళాశాల విద్యార్థులకు ‘నాకు ప్రాణప్రదమైన విషయాలు’ ‘నైతిక విలువలు’ అనే అంశాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు త్వరలో జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్, సుకృతవల్లి, కావ్య పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



దాత వెంకటేశ్వరరావుకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న అర్చకులు



దాత కుటుంబీకులకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ సిబ్బంది



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి చెన్నై వాస్తవ్యులు సాడ్రాస్ కుమార్ వేల్, ఆనంద్ వేల్ గురువారం రూ.30 వేలు విరాళంగా అందజేశారు. అలాగే చెయ్యేరుకు చెందిన త్సవటపల్లి వెంకటేశ్వరరావు, వెంకటరామలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళంగా ఇచ్చారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతలను వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అన్నదాన ట్రస్టుకు రూ.12,001 విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడ కానూరుకు చెందిన కాకుమాని అనిష్, ప్రవల్లిక దంపతులు గురువారం రూ.12,001 విరాళంగా అందించారని ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారు. దాత అనిష్, ప్రవల్లిక దంపతులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం, స్వామి వారి చిత్రపటం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సత్యమూర్తి పాల్గొన్నారు.

26ఆర్‌జడ్ఎల్83: దాత దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి జంగారెడ్డిగూడెంకు చెందిన కఠారి చక్రవర్తి, రమ్యశ్రీ రూ.25,116 విరాళం అందినట్లు ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ రాజశేఖర్

అంబాజీపేట: వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ ఏవీఎస్.రాజశేఖర్ అన్నారు. గంగలకుర్రులో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసుత వాతావరణంలో వరి పంటలో ఆకు ఎండుతెగులు, సుడిదోమ కనిపిస్తుందన్నారు. ఈ తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ ఎం.నందకిషోర్‌లు మాట్లాడుతూ ఆకు ఎండు తెగులు నివారణకు ఎకరాకు ప్లాంటోమైసిన్ 500 గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైడ్ 450 మిల్లీ లీటర్లు చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఏఓ జె.మనోహర్, ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏలు ఎం.ప్రియాంక, భీమారావు, ఎ.బాలకృష్ణ, రైతులు పితాని శ్రీనివాసరావు, యర్రంశెట్టి వీరభద్రరావు, నెల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.